సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం

# శ్రీ సీమకిరణం

SK1 one NEWS HD

SEEMAKIRANAM TELUGU DAILY

జాతీయ తెలుగు దినపత్రిక

ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా

www.seemakiranam.com
www.seemakiranamnews.com
epaper.seemakiranam.com

ప్రచురణ : కర్నూలు & శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా.

PUBLISHED BY : KURNOOL & SRI POTTI SRIRAMULU NELLORE DISTRICT

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 182 | పేజీలు : 04, వెల రూ. 2 రూ/ | సోమవారం 21-09-2026



## ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనానికి ముహూర్తం ఖరారు

- ఈ ఏడాది 12 రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాలు
- సెప్టెంబర్ 25న హుస్సేన్ సాగర్‌లో విగ్రహ నిమజ్జనం
- శ్రీ పంచముఖ సంకటహర మహా గణపతిగా దర్శనమిస్తున్న వినాయకుడు
- అనంత చతుర్దశి రోజున నిమజ్జన కార్యక్రమం

హైదరాబాద్ :

హైదరాబాద్‌లోని ప్రసిద్ధ ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం తేదీ ఖరారైంది. ఈ ఏడాది సెప్టెంబర్ 25న, శుక్రవారం - మిగతా 2 లో

## ఎల్ నినో కంటే రేవంత్ రెడ్డే ప్రమాదకరం




- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు
- అవకాశం ఉన్నా కరెంట్ ఇవ్వకుండా లేని కరవును సృష్టిస్తున్నారంటూ హరీశ్ రావు ఫైర్
- 24 గంటల కరెంట్ పోయి 6-7 గంటలకే పరిమితమైందని విమర్శలు
- మూడు పంటల నుంచి రైతుబంధు పెండింగ్‌లో పెట్టారని ఆరోపణ
- పిట్ట బెదిరింపులకు భయపడేది లేదని ప్రభుత్వానికి హెచ్చరిక

## 'నేను ఎవరి బాణాన్ని కాను బహుజనుల బాణాన్ని'

- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఫైర్
- రాజకీయం అంటే బూతులు తిట్టుకోవడమేనా?
- కోస్గి వేదికగా 'పాంచజన్య సంకల్ప సభ'
- అధికారంలోకి వస్తే ఉచిత వైద్యం
- యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపు
- తెలంగాణ రక్షణ సేనను ఆశీర్వదించాలని విజ్ఞప్తి



హైదరాబాద్ :

రాష్ట్రంలో రాజకీయం అంటే బూతులు తిట్టుకోవడమేనా అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు.నారాయణపేట జిల్లా కొండగల్ నియోజకవర్గ పరిధిలోని కోస్గిలో నిర్వహించిన తెలంగాణ రక్షణ సేన పాంచజన్య సంకల్ప సభలో ఆ సంస్థ చీఫ్ కల్వకుంట్ల కవిత పాల్గొని ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో రాజకీయాలు అంటే కేవలం బూతులు తిట్టుకోవడమేనా అని ఆమె ప్రశ్నించారు. సమాజంలో అధర్మం పెరిగి, పాలకుల వల్ల ప్రజలు ఇబ్బంది పడినప్పుడు శ్రీకృష్ణుడు పాంచజన్యం పూరించి ధర్మపోరాటానికి సిద్ధం కావాలని చెబుతాడని కవిత తెలిపారు. నేడు రాష్ట్రంలో అరాచకాలు పెరిగిపోయాయని, అందుకే తెలంగాణ రక్షణ సేన కోస్గి వేదికగా పాంచజన్యం సభతో ధర్మ యుద్ధానికి దిగుతున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తే ఎదురుదాడికి దిగడం కాంగ్రెస్ పార్టీకి అలవాటైందని, ఈ ప్రభుత్వాన్ని గద్దె దించే సమయం ఆసన్నమైందని హెచ్చరించారు.సీఎం రేవంత్ రెడ్డి (జవీ =వఝుత్ష్ర =వసంసఎ)కి రైతులకు నీళ్లిచ్చే ఆలోచనే లేదని కవిత ఆరోపించారు. నీళ్లు, యూరియా, ధాన్యం కోసం రైతన్నలు అధికారుల కాళ్లు పట్టుకోవాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిన్నటికి నిన్న పాలమూరు రైతులు - మిగతా 2 లో



## ఆంధ్రప్రదేశ్‌లో విమానాశ్రయాలకు అదనపు హంగులు

- రూ.912 కోట్లతో అభివృద్ధి పనులు
- ఏపీలో విమానయాన రంగంపై కేంద్రం ప్రభుత్వం దృష్టి సారించింది
- రూ.912 కోట్లతో 4 చోట్ల మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పనులు చేపట్టింది
- విజయవాడ, తిరుపతి విమానాశ్రయాల్లో దాదాపు పనులు పూర్తయ్యాయి

అమరావతి :

రాష్ట్రంలో విమానయాన రంగాన్ని మరింత విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం విమానాశ్రయాల మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి సారించింది. ప్రాంతాల మధ్య అనుసంధానాన్ని పెంచడంతో - మిగతా 2 లో

## విద్యాశాఖలో రాజకీయాలకు చోటులేదు

- 'నో పాలిటిక్స్ ఇన్ స్కూల్స్' అమలు
- రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్
- కాకినాడలో చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో 'భారతీయం' కార్యక్రమం
- హాజరైన ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- సాంకేతికతకు భారతీయ విలువలు జోడించి ప్రపంచ విజేతలుగా ఎదగాలని పిలుపు
- ప్రభుత్వ కృషికి నైతిక విలువలు తోడైతే ఏపీ విద్యావ్యవస్థ దేశంలోనే నెం.1 అవుతుందని వ్యాఖ్యలు
- త్యాగధనుల బాటలో పయనించి దేశానికి గర్వకారణంగా నిలవాలని విద్యార్థులకు సూచన




అమరావతి :

క్లాస్‌రూమ్ నుంచే సమాజంలో మార్పు సాధ్యమని, విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలు నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్. సాంకేతికతకు భారతీయ విలువలు జోడిస్తే ప్రపంచ విజేతలుగా ఎదగవచ్చని చెప్పారు. విద్యాశాఖలో రాజకీయాలకు చోటు లేకుండా 'నో పాలిటిక్స్ ఇన్ స్కూల్స్' విధానాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు.కాకినాడ జిల్లాలో మంత్రి లోకేశ్ పర్యటించారు. కాకినాడ రూరల్ తిమ్మాపురంలోని ఆకుండి లక్ష్మీ స్మారక గోశాలలో నిర్వహించిన భారతీయం కార్యక్రమంలో మంత్రి నారా లోకేశ్ పాల్గొనడానికి వచ్చిన లోకేశ్‌కి ప్రముఖ ప్రవచనకర్త, ఏపీ ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, పెద్దాపురం ఎమ్మెల్యే చిన్నరాజప్ప, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఘన స్వాగతం పలికారు.విద్యార్థులు ఆలపించిన వందేమాతరం గేయంతో కార్యక్రమం ప్రారంభమైంది. విద్యార్థులను మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన - మిగతా 2 లో

## వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోంది.. నమ్మొద్దు




- డీఎస్సీ స్పోర్ట్స్ కోటా టీచర్ల విజ్ఞప్తి
- విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించిన 370 మంది ఉపాధ్యాయులు
- ప్రతిభ, పతకాలతోనే ఉద్యోగాలు సాధించామని స్పష్టీకరణ
- స్పోర్ట్స్ కోటాను 3 శాతానికి పెంచిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు
- గాయాల కన్నా ఆరోపణలే ఎక్కువ బాధిస్తున్నాయని ఉపాధ్యాయుల ఆవేదన

అమరావతి :

మెగా డీఎస్సీ ద్వారా స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన తమ నియామకాలపై వైసీపీ ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తోందని పలువురు ఉపాధ్యాయులు తీవ్రంగా ఖండించారు. తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన - మిగతా 2 లో

### దేశవ్యాప్త 28 నుంచి 30 వరకు

## బ్యాంకుల సమ్మె



- ఖాతాదారులకు ఎస్‌బీఐ కీలక సూచన
- ఈ నెల 28 నుంచి 30 వరకు దేశవ్యాప్త బ్యాంకుల సమ్మె
- బ్యాంకు పనులు ముందే పూర్తి చేసుకోవాలని కస్టమర్లకు ఎస్‌బీఐ సూచన
- వారాంతపు సెలవులతో కలిపి ఐదు రోజుల పాటు సేవలకు అంతరాయం
- ఏటీఎం, యూపీఐ, నెట్ బ్యాంకింగ్ సేవలు యథాతథంగా కొనసాగుతాయని వెల్లడి
- 'యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్' సమ్మెకు పిలుపు

ఢిల్లీ :

దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తమ ఖాతాదారులకు ఒక ముఖ్యమైన ప్రకటన జారీ చేసింది. 'యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్' (యూఎఫ్‌బీయూ) పిలుపు మేరకు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు మూడు రోజుల పాటు దేశవ్యాప్తంగా - మిగతా 2 లో

## ఆస్కార్ రేసులో ఇళయరాజా

- ఇండియన్ మూవీ నుంచి కాదు
- ఇళయరాజా సంగీతం అందించిన సినిమా ఆస్కార్ రేసులో
- ఆయన సంగీతం అందించిన మరాఠీ చిత్రం 'గోంధల్' ఇప్పటికే భారత్ తరఫున 2027 ఆస్కార్‌కు అధికారిక ఎంట్రీ
- 9వ అకాడమీ అవార్డ్స్‌లో బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్ విభాగం కోసం శ్రీలంక నేషనల్ ఆస్కార్స్ సెలక్షన్ కమిటీకి సమర్పించినట్లు చిత్రబృందం



ఢిల్లీ :

ఇళయరాజా పేరు ఈసారి ఆస్కార్ సీజన్‌లో మరోసారి వినిపిస్తోంది. ఆయన సంగీతం అందించిన మరాఠీ చిత్రం 'గోంధల్' ఇప్పటికే భారత్ తరఫున 2027 ఆస్కార్‌కు అధికారిక ఎంట్రీగా ఎంపికైంది. ఇప్పుడు ఆయన సంగీతంతో వచ్చిన మరో సినిమా కూడా అదే కేటగిరీ - మిగతా 2 లో


## పశ్చిమాసియాలో టెన్షన్




- తమ పౌరులకు అమెరికా కీలక హెచ్చరిక
- సౌదీపై హౌతీ తిరుగుబాటుదారుల దాడుల నేపథ్యంలో కీలక హెచ్చరిక
- పశ్చిమాసియా ప్రయాణాలపై అమెరికా తన పౌరులకు కొత్త అడ్వైజరీ జారీ
- పరిస్థితి ఏ క్షణమైనా తీవ్రరూపం దాల్చవచ్చని ఆందోళన వ్యక్తం చేసిన యూఎస్
- రియాద్ సహా కీలక నగరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు జరిగాయని వెల్లడి
- సౌదీకి లెవెల్ 3, యెమెన్‌కు లెవెల్ 4 అడ్వైజరీ కొనసాగింపు

## ఒకే ఫ్రేమ్‌లో శుక్రుడు, పాలపుంత

- నాసా వ్యోమగామి షేర్ చేసిన అద్భుత చిత్రం!
- అంతరిక్షం నుంచి అద్భుతమైన ఫొటో షేర్ చేసిన నాసా వ్యోమగామి
- ఒకే చిత్రంలో శుక్ర గ్రహం, పాలపుంత, భూమి వాతావరణం
- భూమి ఎర్రటి వాతావరణ కాంతిలో ఉదయిస్తున్న శుక్రుడు
- అరుదైన దృశ్యంపై నెటిజన్ల నుంచి ప్రశంసల వర్షం



# సంపాదకీయం

## ఇది స్వయంకృతం!

జర్మనీ పాలకపక్షం క్రిస్టియన్ డెమాక్రటిక్ యూనియన్(సీడీయూ) అధినేత, చాన్స్‌లర్ ఫ్రెడెరిక్ మెర్జ్‌కు ఇది దుర్వార్త. ఆయనకే కాదు... దశాబ్దాలుగా జర్మనీని ఏలిన మధ్యేవాద, వామపక్షాలకు సైతం మింగుడుపడని విషయం. ఆ మాటకొస్తే యూరప్ ఖండమంతా 'కింకర్తవ్యమ'ంటూ కలవరపడుతోంది. ఉన్నట్టుండి సంభవించిన ఈ 'రాజకీయ భూకంపాన్ని' జీర్ణించుకోలేకపోతోంది. తూర్పు జర్మనీ ప్రాంతంలోని సాక్సోనీ-- అన్‌హాల్ట్ రాష్ట్రంలో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో తీవ్ర మితవాద పక్షం ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ (ఏఎఫ్‌డీ) సాధించిన విజయమే వీరందరికీ నిద్రలేని రాత్రులు మిగిల్చింది. జర్మనీలోని 16 రాష్ట్రాల్లో సాక్సోనీ--అన్‌హాల్ట్ ఒకటి. దాదాపు 21 లక్షల 36 వేల జనాభాగల ఈ రాష్ట్రంలో ఏఎఫ్‌డీ ఇతరచోట్లకన్నా బలంగా ఉందని అందరూ భావించినా... 83 స్థానాలున్న పార్లమెంటులో 39 స్థానాలు, 43.8 శాతం ఓట్లు సాధించి మెజారిటీ పక్షంగా అవతరిస్తుందని ఊహించలేదు. అక్కడి ప్రస్తుత పాలకపక్షం మధ్యేవాద మితవాద సీడీయూ రెండో స్థానంలోకి పోవటమే కాదు, దాని ఓట్ల శాతం 17.2కి పడిపోయింది. మిగిలిన తొమ్మిది పార్టీల తీరెలావుందో చెప్పనవసరం లేదు.రెండో ప్రపంచ యుద్ధానంతరం జర్మనీలో తీవ్ర మితవాద పక్షాలు నామమాత్రంగా ఒకటి రెండు సీట్లు గెల్చు కోవటం తప్ప ఎప్పుడూ అధికారం అంచులవరకూ రాలేదు. ఇప్పుడైనా కనీస మెజారిటీకి మూడు తక్కువొచ్చిన ఏఎఫ్‌డీని అధికారంలోకి రానిస్తారా అనే సంశయం అందరిలో ఉంది. చేతులు కలిపేందుకు వేరే పార్టీలు ముందుకు రాకున్నా, కొందరు ఎంపీలు ఫిరాయించే అవకాశం కనబడుతోంది. అన్ని పక్షాలూ అంటరాని పార్టీగా పరిగణించిన ఏఎఫ్‌డీ కొన్నేళ్లుగా జర్మనీలో తన ఉనికి చాటుకుంటోంది. కానీ సాక్సోనీ-- అన్‌హాల్ట్‌లో అది వేగంగా ఎదగటాన్ని అందరూ గుర్తించారు. వలసలను వ్యతిరేకించటం మొదలుకొని అనేక అంశాల్లో దూకుడుగా పోతున్న ఆ పార్టీని జర్మనీ నిఘా విభాగం 'తీవ్ర మితవాద పక్షం'గా నిర్ధారించింది. పది రోజుల్లో మెక్లిన్‌బర్గ్ పొమెరేనియా రాష్ట్రంలో జరిగే ఎన్నికలు ఎలాంటి ఫలితాన్నిస్తాయో... మరో మూడేళ్లలో జరిగే జాతీయ ఎన్నికల నాటికి ఏమవుతుందోనని వేరే పార్టీలు వణుకుతున్నాయి. ఏఎఫ్‌డీ విజయానికి ఇతర పార్టీలు తమను తామే నిందించుకోవాలి. దశాబ్దాలుగా దేశాన్నేలినా జనం మౌలిక సమస్యల్ని పరిష్కరించటంలో, దిగజారుతున్న ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దటంలో అవన్నీ విఫలమయ్యాయి. వెల్లువలా వచ్చిపడే వలసలను నివారించలేకపోయాయి. గతంలో జర్మన్ డెమాక్రటిక్ రిపబ్లిక్ (జీడీఆర్)గా వామపక్షాల పాలనలో ఉన్న తూర్పు ప్రాంతం... పశ్చిమ ప్రాంతంతో పోలిస్తే అన్నివిధాలా వెనకబడి వుంది. అందువల్ల అక్కడి సమస్యలు మరిన్ని రెట్లు అధికం. రష్యా--ఉక్రెయిన్ యుద్ధం తెచ్చిన అనిశ్చితి వీటికి అదనం. రష్యాతో అనవసర వివాదం తెచ్చుకోకూడదన్నది ఏఎఫ్‌డీ అభిప్రాయం. ఈసారి ముమ్మరంగా పోలింగ్ జరగటం, ఏఎఫ్‌డీ విజయం దీని పర్యవసానమే. మిగిలిన పార్టీలతో పోలిస్తే ఏఎఫ్‌డీ సామాజిక మాధ్యమాల్లో చురుకు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దూకుడును అన్నివిధాలా పుణికిపుచ్చుకుంది. సీడీయూనూ, ఇతర పక్షాలనూ విమర్శలతో చీల్చిచెండాడుతుంటే అటు నోట మాటలేదు.ఇన్నాళ్లూ అమెరికా అడుగుజాడల్లో నడిచి, ఉగ్రవాదంపై యుద్ధం పేరిట అది సాగించిన వృథా యుద్ధాల్లో పాలుపంచుకుని ఇతర యూరప్ దేశాలతోపాటు జర్మనీ కూడా ఆర్థికంగా కుంగిపోయింది. ఆ యుద్ధాలు తెచ్చిన సంక్షోభంతోనే పలు ముస్లిం దేశాలనుంచి వలసలు అధికమయ్యాయి. అమెరికా సలహాతో యూరప్ దేశాలు ఉక్రెయిన్‌ను ఎగదోయకుంటే రష్యాతో లడాయి ఉండేది కాదు. సాక్సోనీ--అన్‌హాల్ట్ ఫలితం గమనిస్తే మెజారిటీ ప్రజలు ఆ యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నారనీ, అధికార సీడీయూ విధానాలపై అసంతృప్తి చెందారనీ అర్థమవుతుంది. అయితే వేరే దేశాల్లోని తీవ్ర మితవాద పక్షాల్లాగే ఏఎఫ్‌డీ కూడా పర్యావరణ విధ్వంసాన్ని అబద్ధమంటుంది. ఎల్‌జీబీటీక్యూ హక్కులకు ఆ పార్టీ పూర్తి వ్యతిరేకం. వలసలు సరేసరి. జర్మన్లకు మాత్రమే దేశం సొంతమనీ, అన్యులను రానీయొద్దనీ దాని నినాదం. నాజీ పాలనలో విద్వేషాన్నీ, మారణహోమాల్నీ చూసిన జర్మనీలో తిరిగి ఆ మాదిరి పార్టీ అందలం ఎక్కే స్థితి ఏర్పడటానికి కారణమేమిటో ఆ దేశంతోపాటు ఫ్రాన్స్, స్పెయిన్ వగైరా యూరప్ దేశాలు ఆత్మ పరిశీలన చేసుకోవాలి.

# విద్యాశాఖలో రాజకీయాలకు చోటులేదు

**మొదటిపేజీ తరువాయి -**

విద్యార్థులు పాల్గొన్నారు. మహాత్మా గాంధీ, నెహ్రూ, సర్దార్ పటేల్, లాల్‌బహదూర్ శాస్త్రి, అంబేద్కర్, అబ్దుల్ కలామ్, విశ్వేశ్వరయ్య తదితరుల పాత్రలను విద్యార్థులు ప్రదర్శించారు. వారి దేశభక్తి సందేశాలు ఆకట్టుకున్నాయి. చాగంటి కోటేశ్వరరావు విద్యార్థులకు నైతిక విలువలు, దేశభక్తిపై సందేశం ఇచ్చారు. అనంతరం మంత్రి నారా లోకేశ్ విద్యార్థులతో ముచ్చటించారు. లోకేశ్ తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. దేశభక్తి, త్యాగధనుల స్ఫూర్తి, విలువల విద్యపై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.సాంకేతికతకు భారతీయ విలువలు తోడైతే, ప్రపంచ విజేతలుగా ఎదగొచ్చని పిల్లల్లో చిన్నప్పటి నుంచే పెద్దలను, మహిళలను గౌరవించడం గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించడం నేర్పించాలని మంత్రి లోకేశ్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన సంస్కరణలను ప్రస్తావించిన మంత్రి లోకేశ్ ఈ ఏడాది లక్షా పది వేల మంది విద్యార్థులు ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని, ఇంటర్‌లోనూ పది వేల అడ్మిషన్లు పెరిగాయన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని చెప్పారు. నైతిక విలువలు కూడా తోడైతే ఏపీ మోడల్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ దేశంలోనే ప్రత్యేకంగా నిలుస్తుందన్నారు.విద్యాశాఖలో రాజకీయాలకు చోటు లేకుండా 'నో పాలిటిక్స్ ఇన్ స్కూల్స్' విధానాన్ని అమలు చేస్తున్నామని మంత్రి లోకేశ్ తెలిపారు. యూనిఫాం, పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు, షూస్‌లో రాజకీయ పార్టీ రంగులు లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. సమాజంలో మార్పు క్లాస్‌రూమ్ నుంచే ప్రారంభమవుతుందని ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం విద్యార్థి కేంద్రంగా ఉండాలన్నారు.రోబోటిక్స్ గురించి మాట్లాడుతున్నాం వాటికి భారతీయం, నైతిక విలువలు తోడవ్వాలి' అని అప్పుడే మనం ప్రపంచ విజేతలుగా ఎదుగుతామని లోకేశ్ చెప్పారు. చిన్నచిన్న సమస్యలకు కుంగిపోకుండా ఎదురొడ్డి నిలవాలని విద్యార్థులకు మంత్రి సూచించారు. మార్కులు తక్కువ వచ్చాయని, అనుకున్నది సాధించలేకపోయామని తీవ్రమైన నిర్ణయాలు తీసుకోవద్దని చెప్పారు. ఇంట్లో చెప్పుకోలేని సమస్యలు ఉంటే ఉపాధ్యాయులతో పంచుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల త్యాగాలను గుర్తుంచుకుని వారు గర్వపడేలా ఎదగాలని పిలుపునిచ్చారు."విద్య వల్ల సమాజంలో మార్పు తీసుకురావచ్చు. నాకు విద్యాశాఖను ఇవ్వాలని సీఎంను కోరాను. విద్య, ప్రభుత్వ స్కూళ్లంటే సీఎంకు చాలా ఇష్టం. విద్యావ్యవస్థ రాజకీయాలకు దూరంగా ఉండాలి. గతంలో బాపట్లలో జరిగిన మెగా పీటీఎంకు సీఎం వచ్చారు. నాడు పిల్లలకు పెట్టే భోజనమే సీఎంకు వడ్డించారు. ఈ భోజనం క్వాంటిటీ సరిపోదు, పెంచాలని సీఎం చెప్పారు. ఎక్కడా లేని విధంగా ఏపీలోని ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు పెరిగాయి. ఓర్పు, సహనం, నైతిక విలువలు మనకు చాలా అవసరం. దేశం కోసం ఆలోచించాలి, దేశం కోసం త్యాగం చేయాలి.సక్సెస్‌కు షార్ట్‌కట్ ఉండదని హార్డ్‌వర్క్‌తోనే మంచి స్థాయికి వెళ్లగలమని లోకేశ్ అన్నారు. గెలుపు, ఓటమి రెండింటినీ సమానంగా తీసుకోవాలని తల్లిదండ్రులు తలదించుకునేలా కాకుండా తలెత్తుకునేలా చేయాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ప్రముఖ ప్రవచన కర్త, ప్రభుత్వ సలహాదారుడు చాగంటి కోటేశ్వరరావు అన్నారు. దేశ స్వాతంత్ర్యం గత చరిత్ర మాత్రమే కాదని అది భారతీయుల వారసత్వ సంపద అని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులు నడయాడిన ప్రదేశాలను సందర్శించడం ద్వారా పిల్లల్లో దేశభక్తి మరింత పెరుగుతుందని చెప్పారు.స్వాతంత్ర్య పోరాటం గత చరిత్ర కాదు మన భారతీయుల వారసత్వ సంపద అని చాగంటి కోటేశ్వరరావు అన్నారు. ఎందరో మహనీయులు తమ జీవితాలను త్యాగం చేసి మనకు స్వేచ్ఛను అందించారన్నారు. ఆ త్యాగాల విలువను తెలుసుకుని భావితరాలకు అందించాలన్నారు. గాంధీ నుంచి అంబేద్కర్ వరకు ప్రకాశం పంతులు నుంచి పొట్టి శ్రీరాములు వరకు దేశం కోసం జీవితాలను అంకితం చేసిన మహనీయుల చరిత్రను పిల్లలకు తెలియజేయాలని చాగంటి కోటేశ్వరరావు సూచించారు.దేశభక్తి అంటే కేవలం జాతీయ జెండాను ఎగురవేయడం మాత్రమే కాదని స్వేచ్ఛ వెనుక ఉన్న త్యాగాలను గుర్తుంచుకోవడమని చాగంటి కోటేశ్వరరావు అన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి నైతిక విలువలు చరిత్ర పట్ల గౌరవం పెంపొందించేందుకు నిర్వహించిన భారతీయం కార్యక్రమం త్యాగధనుల స్ఫూర్తిని మరోసారి గుర్తుచేసింది.

# ఆంధ్రప్రదేశ్‌లో విమానాశ్రయాలకు అదనపు హంగులు

**మొదటిపేజీ తరువాయి -**

పాటు దేశీయ విమాన సర్వీసులను విస్తరించి విమాన ప్రయాణాన్ని ఎక్కువ మందికి అందుబాటులోకి తీసుకురావాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.ఇందుకుగానూ విజయవాడ, తిరుపతి, రాజమహేంద్రవరం, కడప విమానాశ్రయాల్లో మొత్తం రూ.912.94 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టింది. రన్‌వే విస్తరణ, కొత్త టెర్మినల్ భవనాలతో పాటు అనుసంధాన రోడ్లు, ప్రయాణికులకు అవసరమైన ఇతర మౌలిక వసతులు వంటి పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. తిరుపతి, విజయవాడ విమానాశ్రయాల్లో చేపట్టిన పనులు ఇప్పటికే పూర్తి కావొచ్చాయి. రాజమహేంద్రవరం, కడప విమానాశ్రయాల్లో ప్రతిపాదించిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి.విజయవాడ విమానాశ్రయంలో రూ.473.03 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవనం, టెక్నికల్ బ్లాక్ పనులు దాదాపు పూర్తయ్యాయి. తుది దశ పనులు ముగిశాక ప్రయాణికులకు విశాలమైన టెర్మినల్, ఆధునిక చెక్-ఇన్, భద్రతా ఏర్పాట్లు, వేచి ఉండే హాళ్లు అందుబాటులోకి రానున్నాయి. పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ విస్తరణ చేపట్టారు.కడప విమానాశ్రయంలో కొత్త డొమెస్టిక్ టెర్మినల్ భవనం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా రూ.210.61 కోట్లతో పనులు ప్రతిపాదించింది. ఇప్పటికే సుమారు 70 శాతం నిర్మాణం పూర్తైంది. అభివృద్ధి పనులు పూర్తయితే దాదాపు 16 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో కొత్త సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. దీంతో భవిష్యత్తులో మరిన్ని దేశీయ విమాన సర్వీసులను నిర్వహించే అవకాశం ఉంటుంది.రాజమహేంద్రవరం విమానాశ్రయంలో రూ.173.28 కోట్లతో కొత్త డొమెస్టిక్ టెర్మినల్, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి పనులను ఏఏఐ ప్రతిపాదించింది. వాటిలో 91 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు పూర్తయ్యాక సుమారు 21 వేల చదరపు మీటర్ల అదనపు స్థలం ప్రయాణికుల వినియోగానికి అందుబాటులోకి రానుంది. కొత్త టెర్మినల్ ద్వారా ప్రయాణికుల రద్దీని మరింత సమర్థంగా నిర్వహించే వీలుంటుంది.తిరుపతి విమానాశ్రయంలో రూ.55.92 కోట్లతో నిర్మించిన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్, టెక్నికల్ బ్లాక్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. త్వరలో వీటిని ప్రారంభించనున్నారు. ప్రస్తుతం తిరుపతి నుంచి బెంగళూరు, ముంబయి, ఢిల్లీ, హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, బెళగావి, గోవా (శివమొగ్గ మీదుగా), కొల్హాపూర్ తదితర నగరాలకు డొమెస్టిక్ సర్వీసులు నడుస్తున్నాయి.నాలుగు విమానాశ్రయాల్లో అభివృద్ధి పనులు పూర్తయితే రాష్ట్రంలో విమాన ప్రయాణ సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. కొత్త టెర్మినల్ భవనాలు, ఆధునిక సాంకేతిక సదుపాయాలు, విస్తరించిన మౌలిక వసతులతో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందడంతో పాటు రాష్ట్రంలోని ప్రధాన నగరాల మధ్య అనుసంధానం మరింత బలోపేతం కానుంది.

# ఆస్కార్ రేసులో ఇళయరాజా

**మొదటిపేజీ తరువాయి -** కోసం వెళుతోంది. అయితే ఈసారి సినిమా భారత్ నుంచి కాదు, శ్రీలంక నుంచి. ముఖ్యంగా ఇది శ్రీలంకలో రూపొందిన తమిళ చిత్రం కావడం మరో హైలెట్. అయితే ఈ సినిమా ఇంకా శ్రీలంక అధికారిక ఆస్కార్ ఎంట్రీగా ఎంపిక కాలేదు. ముందుగా అక్కడి జాతీయ సెలక్షన్ ప్రక్రియను దాటాల్సి ఉంది.ఇళయరాజా సంగీతం అందించిన సినిమా 'ఆంటోనీ'. ఈ సినిమాను 2027లో జరిగే 99వ అకాడమీ అవార్డ్సులో బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్ విభాగం కోసం పరిశీలించేందుకు శ్రీలంక నేషనల్ ఆస్కార్స్ సెలక్షన్ కమిటీకి సమర్పించినట్లు చిత్రబృందం తెలిపింది. శ్రీలంక నేషనల్ ఫిల్మ్ కార్పొరేషన్ ద్వారా ఈ ప్రక్రియ జరిగినట్లు సమాచారం. ఆస్కార్‌కు వెళ్లాలనుకునే అర్హత ఉన్న శ్రీలంక సినిమాలను ముందుగా తొమ్మిది మంది సభ్యులతో కూడిన కమిటీ పరిశీలిస్తుంది. వాటిలో ఒక సినిమాను మాత్రమే దేశం తరపున అధికారికంగా అకాడమీకి పంపనున్నారు. 'ఆంటోనీ' ఇప్పుడు ఆ ఎంపిక కోసం పోటీపడుతున్న చిత్రాల్లో ఒకటిగా ఉంది.'ఆంటోనీ' శ్రీలంక తమిళ కుటుంబ కథగా రూపొందింది. ప్రశాంతంగా జీవించాలని కోరుకునే ఆంటోనీ అనే మత్స్యకారుడి చుట్టూ కథ సాగుతుంది. అతని గతం గురించి తెలియని మరో యువ మత్స్యకారుడితో సమస్య మొదలైన తర్వాత కథ మారుతుంది. కయల్ విన్సెంట్ టైటిల్ రోల్ చేయగా, టీజే భాను ఆయన భార్య పాత్రలో నటించారు. సుదర్శన్ రవీంద్రన్, సౌమి మునసింగ్, నిళల్‌గల్ రవి, అరుళ్‌దాస్ ఇతర పాత్రల్లో కనిపించారు. శ్రీలంక సముద్ర ప్రాంతాలు, అక్కడి జీవన విధానాన్ని కథలో భాగంగా తీసుకున్నారు. సినిమా మార్చి 13న థియేటర్లలో విడుదలైంది.సుకిర్తన్ క్రిస్తురాజా, జెనోసన్ రాజేశ్వర్ కలిసి 'ఆంటోనీ'కి దర్శకత్వం వహించారు. కథ, స్క్రీన్‌ప్లే పనుల్లో కూడా వీరిద్దరూ భాగమయ్యారు. ఓసై ఫిల్మ్స్ బ్యానర్‌పై కళైవళరి సాగ రామనాథన్, సుగంతిని నిర్మించారు. విజయ్ బాలసింగం, శ్రీకందరాజా, విక్కీ సహ నిర్మాతలుగా వ్యవహరించారు. రిషి సెల్వం సినిమాటోగ్రఫీ అందించగా, సురేష్ ఏ ప్రసాద్ ఎడిటింగ్ చేశారు. ఇళయరాజా పాటలతో పాటు నేపథ్య సంగీతం కూడా అందించారు. తమిళంతో పాటు మూడు భాషల్లో సినిమాను రూపొందించినట్లు చిత్రబృందం తెలిపింది. థియేట్రికల్ రిలీజ్ తర్వాత అమెజాన్ ప్రైమ్ వీడియో, టెంట్‌కొట్టా సహా పలు డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో కూడా సినిమాను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు రిపోర్ట్స్ పేర్కొన్నాయి. ఆస్కార్ కోసం భారత్ పంపిన సినిమాల లిస్ట్‌లో ఇళయరాజా సంగీతం గతంలోనూ ఉంది. కమల్ హాసన్ నటించిన 'దేవర్ మగన్'ను భారత్ 1992లో అధికారికంగా పంపింది. 2000లో కమల్ దర్శకత్వం వహించిన 'హే రామ్' కూడా భారత్ తరఫున ఆస్కార్‌కు వెళ్లింది. ఈ రెండు సినిమాలకు ఇళయరాజానే సంగీతం అందించారు. అయితే రెండూ చివరి నామినేషన్స్‌లో చోటు దక్కించుకోలేకపోయాయి. ఇప్పుడు మరోసారి ఆయన సంగీతం ఉన్న సినిమాలు ఆస్కార్ ప్రక్రియలోకి రావడం జరిగింది. 'గోంధల్' భారత్ నుంచి ఇప్పటికే ఎంపిక కాగా, 'ఆంటోనీ' శ్రీలంకలో ఇంకా దేశీయ సెలక్షన్ దశలోనే ఉంది.శ్రీలంక నేషనల్ ఫిల్మ్ కార్పొరేషన్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆస్కార్ కోసం సినిమాలను సమర్పించేందుకు సెప్టెంబర్ 21 సాయంత్రం 4 గంటల వరకు గడువు ఉంది. ఆ తర్వాత నేషనల్ ఆస్కార్స్ సెలక్షన్ కమిటీ అర్హత ఉన్న సినిమాలను చూసి ఒక చిత్రాన్ని ఎంపిక చేస్తుంది. శ్రీలంక తరఫున 2027 ఆస్కార్‌కు వెళ్లే అధికారిక సినిమా ఏదో సెప్టెంబర్ 28న ప్రకటించనున్నారు.

## వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోంది.. నమ్మొద్దు

**మొదటిపేజీ తరువాయి -** వ్యక్తం చేశారు. ఈ మేరకు విజయవాడలో సుమారు 370 మంది స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులు ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి, తమ నిరసనను తెలియజేశారు.ఈ సమావేశంలో టీచర్లు "అబద్ధాలు వద్దు - ఆత్మగౌరవం ముద్దు" అంటూ నినాదాలు చేశారు. తాము ఎంతో కష్టపడి, క్రీడల్లో పతకాలు సాధించి మెరిట్ ఆధారంగానే ఉద్యోగాలు పొందామని స్పష్టం చేశారు. మెగా డీఎస్సీ ప్రక్రియను అప్రతిష్ఠపాలు చేసే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు. ఈ సందర్భంగా, స్పోర్ట్స్ కోటాను 3 శాతానికి పెంచి తమకు న్యాయం చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. "కొంతమంది కావాలనే మాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వైసీపీ నేతలు అనుకునే గాంబ్లింగ్, పేకాట స్పోర్ట్స్ కోటాలో ఉండవు. బ్రిడ్జి గేమ్ గురించి తెలియక పేకాట అని తప్పుగా ప్రచారం చేస్తున్నారు. మాపైకి రాజకీయాలు నెట్టవద్దు. ఆటల్లో తగిలిన శారీరక గాయాల కన్నా, వారి మాటలు మమ్మల్ని మానసికంగా ఎక్కువ బాధిస్తున్నాయి" అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. "ఆరోపణలు చేస్తున్న ఛానళ్లు, నాయకులు కళ్లు తెరిచి మా సర్టిఫికెట్లు చూడాలి. ప్రతిభ ఉంటే ఒకే కుటుంబంలో ఇద్దరికి ఉద్యోగాలు రాకూడదా?" అని వారు ప్రశ్నించారు. వైసీపీ చేస్తున్న నిరాధార ఆరోపణలను ప్రజలు నమ్మవద్దని వారు విజ్ఞప్తి చేశారు.

## దేశవ్యాప్త 28 నుంచి 30 వరకు బ్యాంకుల సమ్మె

**మొదటిపేజీ తరువాయి -** బ్యాంకులు సమ్మెకు దిగనున్నాయి. అయితే, దీనికి ముందు సెప్టెంబర్ 26, 27 తేదీలు శని, ఆదివారాలు కావడంతో వరుసగా ఐదు రోజుల పాటు బ్యాంకు శాఖలలో ప్రత్యక్ష సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉందని ఎస్‌బీఐ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమైన బ్యాంకు లావాదేవీలు ఉన్నవారు సమ్మె కంటే ముందే వాటిని పూర్తి చేసుకోవాలని సూచించింది.యూఎఫ్‌బీయూ తమ ఆందోళనలో భాగంగా ఇప్పటికే సెప్టెంబర్ 11న ఒకరోజు సమ్మె నిర్వహించింది. తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల చివరలో మరోసారి నిరసనకు సిద్ధమైంది. అంతేకాకుండా అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు కూడా పిలుపునివ్వడంతో బ్యాంకింగ్ రంగంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఎస్‌బీఐ ఈ ముందస్తు సలహాలు జారీ చేసింది.సమ్మె సమయంలో బ్రాంచ్‌లలో సిబ్బంది సహాయం అవసరమయ్యే పనులు, డాక్యుమెంట్ల పరిశీలన, కొన్ని రకాల చెక్కుల ప్రాసెసింగ్ వంటి సేవలకు ఆటంకం కలగవచ్చని బ్యాంకు స్పష్టం చేసింది. సమ్మెలో ఎంతమంది ఉద్యోగులు పాల్గొంటారనే దానిపై బ్రాంచ్‌ల పనితీరు ఆధారపడి ఉంటుందని తెలిపింది. అయితే, వినియోగదారులు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించుకోవాలని కోరింది.నగదు అవసరాల కోసం ఏటీఎంలు, ఆటోమేటెడ్ డిపాజిట్ అండ్ విత్‌డ్రాయల్ మెషీన్‌లు (ఏడీడబ్ల్యూఎం), అలాగే కస్టమర్ సర్వీస్ పాయింట్లు (సీఎస్‌పీ) అందుబాటులో ఉంటాయని ఎస్‌బీఐ పేర్కొంది. వీటితో పాటు ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, యోనో, యూపీఐ వంటి డిజిటల్ సేవలు యథాతథంగా పనిచేస్తాయని స్పష్టం చేసింది.నిధుల బదిలీ, ఆన్‌లైన్ చెల్లింపులు వంటి వాటిని ఈ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఎలాంటి ఆటంకం లేకుండా చేసుకోవచ్చని వివరించింది. అయితే, భౌతికంగా బ్రాంచ్‌కు వెళ్లాల్సిన పనులను మాత్రం ముందుగానే ప్లాన్ చేసుకోవడం ఉత్తమమని ఖాతాదారులకు సూచించింది.

## ఒకే ఫ్రేమ్‌లో శుక్రుడు, పాలపుంత

**మొదటిపేజీ తరువాయి -** అంతరిక్షం నుంచి మన భూమి, ఇతర గ్రహాలు ఎలా కనిపిస్తాయో వివరిస్తూ వ్యోమగాములు పంచుకునే ఛాయాచిత్రాలు ఎప్పుడూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటాయి. తాజాగా నాసా వ్యోమగామి డోన్ పెటిట్ పంచుకున్న ఒక అద్భుతమైన చిత్రం ప్రస్తుతం ఇంటర్నెట్‌లో అందరినీ ఆకట్టుకుంటోంది. కక్ష్య నుంచి తీసిన ఈ చిత్రంలో పలు ఖగోళ అద్భుతాలు ఒకే ఫ్రేమ్‌లో బందీ కావడం విశేషం.ఈ చిత్రంలో భూ వాతావరణంలోని ఎర్రటి కాంతుల (ఎయిర్‌గ్లో) గుండా ప్రకాశవంతమైన శుక్ర గ్రహం ఉదయిస్తున్నట్లు కనిపిస్తోంది. దిగువ భాగంలో ఊదా రంగులో మెరుస్తున్న వాతావరణ కాంతులు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి.ఈ ఛాయాచిత్రాన్ని సోషల్ మీడియాలో పంచుకుంటూ డోన్ పెటిట్ ఒక ఆసక్తికరమైన వ్యాఖ్యను జోడించారు. "భూమి ఎర్రటి వాతావరణ కాంతిలో ఉదయిస్తున్న శుక్రుడు.. గ్రహం పైన పాలపుంత కనిపిస్తోంది.. కింద ఊదా రంగు మెరుపులు ప్రకాశిస్తున్నాయి.. అనంతమైన నక్షత్రాల మధ్య రెండు తపాను ప్రపంచాలు మెరుస్తున్నాయి" అని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు.ఈ ఫొటో చూసిన నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. "అద్భుతం" అంటూ రకరకాలుగా కామెంట్లు పెడుతున్నారు. శుక్ర గ్రహం, పాలపుంత, భూ వాతావరణంలోని అద్భుతమైన రంగులు ఒకేచోట కనిపించడం చాలా అరుదని, ఇది కళ్లకు కనులపండువ చేసే దృశ్యమని అభిప్రాయపడుతున్నారు. అంతరిక్షం నుంచి మన గ్రహాన్ని, విశ్వాన్ని వీక్షించడం ఒక ప్రత్యేక అనుభూతిని కలిగిస్తుందని ఈ చిత్రం మరోసారి నిరూపించింది.


## ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనానికి ముహూర్తం ఖరారు

**మొదటిపేజీ తరువాయి -** రోజున గణనాథుడిని హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేయనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రకటించింది. అనంత చతుర్దశి పర్వదినం సెప్టెంబర్ 25న రావడంతో, అదే రోజు నిమజ్జన కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారు.ఈ సంవత్సరం ఖైరతాబాద్ వినాయకుడు "శ్రీ పంచముఖ సంకటహర మహా గణపతి"గా భక్తులకు దర్శనమిస్తుండడం తెలిసిందే. ప్రతి ఏటా 11 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు, ఈసారి ఒక రోజు అదనంగా 12 రోజుల పాటు కొనసాగనుండటం విశేషం. దీంతో భక్తులకు స్వామి వారిని దర్శించుకునేందుకు అదనపు సమయం లభించనుంది.ప్రతి సంవత్సరం మాదిరిగానే, ఈసారి కూడా భారీ ఏర్పాట్ల మధ్య మహాగణపతిని హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నిమజ్జనం తేదీ ఖరారు కావడంతో, భక్తులు మరియు నగర వాసులలో ఉత్సాహం నెలకొంది.

## పశ్చిమాసియాలో టెన్షన్.. తమ పౌరులకు అమెరికా కీలక హెచ్చరిక

**మొదటిపేజీ తరువాయి -** యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు సౌదీ అరేబియాపై క్షిపణి, డ్రోన్ దాడులు చేస్తున్న నేపథ్యంలో అమెరికా అప్రమత్తమైంది. పశ్చిమాసియాలో భద్రతా పరిస్థితులు సంక్లిష్టంగా ఉన్నాయని, ఏ క్షణంలోనైనా ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చవచ్చని హెచ్చరిస్తూ.. తన పౌరులకు కొత్త ట్రావెల్ అడ్వైజరీని జారీ చేసింది. ఈ ప్రాంతంలో ఉన్నవారు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, ప్రయాణాలు పెట్టుకోవాలనుకునే వారు తమ నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని స్పష్టం చేసింది.అమెరికా విదేశాంగ శాఖ (స్టేట్ డిపార్ట్‌మెంట్) ఈ హెచ్చరికను విడుదల చేసింది. ఇప్పటికే పశ్చిమాసియాలో ఉన్న అమెరికన్లు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, విమానాలు రద్దు కావడం, గగనతలాలు మూసివేయడం వంటి ప్రయాణ అంతరాయాలకు సిద్ధంగా ఉండాలని సూచించింది. పశ్చిమాసియాకి లేదా ఆ మార్గం గుండా ప్రయాణించాలనుకునే వారు తమ ప్రణాళికలను తీవ్రంగా పునఃపరిశీలించుకోవాలని, విమానాశ్రయాలు, ఎయిర్‌లైన్స్ కార్యకలాపాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని కోరింది.ఇరాన్ మద్దతున్న హౌతీ తిరుగుబాటుదారులు సౌదీ అరేబియాలోని పౌర విమానాశ్రయాలను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతున్నారని ఈ అడ్వైజరీలో ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఈ ఘర్షణ "వేగంగా తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంది" అని అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. ఇరాన్, దాని మద్దతు ఉన్న గ్రూపులు విదేశాల్లోని అమెరికా ప్రయోజనాలు, వ్యాపారాలు, సంస్థలను లక్ష్యంగా చేసుకోవచ్చని కూడా హెచ్చరించింది.సౌదీ రాజధాని రియాద్‌తో పాటు యాన్బు వంటి ఇతర సున్నిత ప్రాంతాలపై బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసినట్లు హౌతీలు ప్రకటించిన కొద్దిసేపటికే ఈ హెచ్చరిక వెలువడింది. రాజధాని వైపు దూసుకొస్తున్న ఒక క్షిపణిని అడ్డుకున్నామని సౌదీ ఎయిర్ డిఫెన్స్ దళాలు తెలిపాయి. రియాద్ విమానాశ్రయం సమీపంలో పేలుళ్లు, పొగ కనిపించినట్లు వార్తలు వచ్చినా.. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని సౌదీ అధికారులు ప్రకటించారు.ఇరాన్ డ్రోన్లు, క్షిపణుల ముప్పు, సాయుధ ఘర్షణలు, ఉగ్రవాదం వంటి కారణాలతో సౌదీ అరేబియాపై ఇప్పటికే లెవెల్ 3 (ప్రయాణాన్ని పునఃపరిశీలించండి) అడ్వైజరీ కొనసాగుతోంది. ఇక యెమెన్‌పై లెవెల్ 4 (ప్రయాణం చేయవద్దు) హెచ్చరిక అమల్లో ఉంది. యెమెన్ సరిహద్దుకు సమీపంలో పనిచేసే అమెరికా ప్రభుత్వ ఉద్యోగులపై అదనపు ఆంక్షలు కూడా విధించారు.

## ఎల్ నినో కంటే రేవంత్ రెడ్డే ప్రమాదకరం



**మొదటిపేజీ తరువాయి -** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రకృతి విపత్తు అయిన ఎల్ నినో కంటే రేవంత్ రెడ్డే రాష్ట్రానికి అత్యంత ప్రమాదకరమని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కరెంట్ కోతలు విధిస్తూ, నీళ్లు ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతోందని, రాష్ట్రంలో లేని కరవును సృష్టిస్తోందని ఆరోపించారు.యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హరీశ్ రావు మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న సర్వేలన్నీ కేసీఆర్‌కు అనుకూలంగా ఉన్నాయని, అందుకే కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు పెరిగాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని చెప్పుకుంటూనే రాక్షస పాలన సాగిస్తోందని విమర్శించారు."అవకాశం ఉన్నప్పటికీ విద్యుదుత్పత్తి చేయకుండా బొగ్గు కొరత అనే సాకుతో కరెంట్ కోతలు విధిస్తున్నారు. కేసీఆర్ గారి హయాంలో 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తే.. ఇప్పుడు కేవలం 6-7 గంటల నాణ్యత లేని విద్యుత్ మాత్రమే వస్తోంది. దీంతో పంటలు ఎండిపోతున్నాయి. కృష్ణా నదిలో నీళ్లున్నా కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి లిఫ్టులను ఆన్ చేయడం లేదు," అని హరీశ్ రావు మండిపడ్డారు.మూడు పంటల నుంచి రైతుబంధు నిధులు విడుదల చేయలేదని, కరోనా కష్టకాలంలో కూడా కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు ఆపలేదని గుర్తుచేశారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిపై ప్రమాణం చేసి కూడా సీఎం రేవంత్ రెడ్డి దేవుణ్ని మోసం చేశారని ఆరోపించారు. బాండ్ పేపర్లపై ఇచ్చిన 420 హామీలు, గొర్రెల పంపిణీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాల ఊసే లేదని విమర్శించారు. తనను ప్రశ్నించినందుకు పిట్ట బెదిరింపులకు పాల్పడితే భయపడేది లేదని, ఆయన సంగతి చూస్తామని హెచ్చరించారు."కేసీఆర్‌పై బురద చల్లితే రైతులకు న్యాయం జరగదు. పాలించడం చేతకాకపోతే నుదుటిపై 'నామమ్' రాసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలి" అని హరీశ్ రావు హితవు పలికారు.

# 'నేను ఎవరి బాణాన్ని కాను.. బహుజనుల బాణాన్ని'

**మొదటిపేజీ తరువాయి -** జూరాల హెడ్ రెగ్యులేటర్‌ను పగులగొట్టి మరీ నీళ్లు విడుదల చేసుకోవాల్సి వచ్చిందని గుర్తుచేశారు. వరి, మొక్కజొన్న రైతులు తమ పంటను కొనమని వేడుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, రాష్ట్రంలో మళ్లీ ఆత్మహత్యల తెలంగాణ కావాలా అని ప్రశ్నించారు.రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తే ప్రజలకు పూర్తిగా ఉచితంగా వైద్యం అందిస్తామని కవిత తెలిపారు. విద్య, వైద్య రంగాభ అభివృద్ధి కోసం రూ. లక్ష కోట్లు అయినా సరే వెనకాడకుండా ఖర్చు చేస్తామని హామీనిచ్చారు. పాలమూరులో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని పేర్కొన్నారు. బాధ్యత లేని నాయకులు ఉన్నప్పుడు యువత బలమైన నాయకులుగా రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు.బీఆర్ఎస్ పార్టీ నేతలేమో తాను కాంగ్రెస్ విడిచిన బాణమని, సీఎం రేవంత్ రెడ్డి ఏమో కల్వకుంట్ల కుటుంబం అవినీతి పేరుతో తాను బీఆర్ఎస్ (దీ=హా) విడిచిన బాణమని ప్రచారం చేస్తూ కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. తాను ఎవరి బాణాన్ని కాదని, తెలంగాణ బహుజనుల బాణాన్ని అని స్పష్టం చేశారు. ఈ సభలో ప్రజా గాయకుడు గద్దర్ పాడిన 'భలేగుందిరో మన అసెంబ్లీ' పాటలోని చరణాలను పాడి నాయకులు, కార్యకర్తల్లో జోష్ నింపారు. ప్రజలంతా ఏకమై తెలంగాణ రక్షణ సేనను అక్కున చేర్చుకుని ఆశీర్వదిస్తే, రాష్ట్రంలోని సమస్యల పరిష్కారానికి నడుం బిగిస్తామని కవిత పిలుపునిచ్చారు.



కర్నూలు సీమకిరణం నంద్యాల
తెలుగు దినపత్రిక
www.seemakiranam.com, www.seemakiranamnews.com



# కర్నూలులో 1,500 గణేష్ విగ్రహాల నిమజ్జనం

**2 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు**

**డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిఘా.. నిమజ్జనం రోజున ట్రాఫిక్ మళ్లింపు**

**ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలి : ఎస్పీ విక్రాంత్ పాటిల్**



**కర్నూలు క్రైమ్, సెప్టెంబర్ 20, (సీమకిరణం న్యూస్):** సెప్టెంబర్ 22న (మంగళవారం) కర్నూలు నగరంలో సుమారు 1,500 గణేష్ విగ్రహాల నిమజ్జనం జరగనున్న నేపథ్యంలో జిల్లా పోలీసుశాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. కర్నూలు వినాయక్ ఘాట్, హెచ్ఎన్ఎస్ఎస్ నన్నూరు, ఉలిందకొండ ప్రాంతాల్లో నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదివారం తెలిపారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా 2 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. బందోబస్తు విధుల్లో ఇద్దరు అదనపు ఎస్పీలు, 16 మంది డీఎస్పీలు, 85 మంది సీఐలు, ఆర్ఐలు, 150 మంది ఎస్ఐలతో పాటు పోలీసు సిబ్బందిని మోహరించినట్లు తెలిపారు.

### సాంకేతిక పరిజ్ఞానంతో నిఘా...

నిమజ్జన కార్యక్రమాన్ని డ్రోన్లు, సీసీ కెమెరాలు, వీడియో కెమెరాలతో నిరంతరం పర్యవేక్షించనున్నట్లు ఎస్పీ తెలిపారు. బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ బృందాలతో విస్తృత తనిఖీలు చేపడుతున్నామని పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే 112, 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. అల్లరి మూకలపై ప్రత్యేక నిఘా ఉంటుందని, ఇతరుల మనోభావాలను గౌరవిస్తూ ఉత్సవాలను నిర్వహించాలని ఎస్పీ కోరారు. మద్యం సేవించి అత్యుత్సాహం ప్రదర్శించడం, అనధికారికంగా మద్యం విక్రయించడం, నిబంధనలకు విరుద్ధంగా డీజేలు వినియోగించడం వంటి చర్యలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### విగ్రహాల నిర్వాహకులకు సూచనలు...

విగ్రహాల ఊరేగింపులో సమయపాలన పాటించాలని, అవసరమైన వాహనాలు, క్రేన్లను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఊరేగింపు వాహనాలపై చిన్నపిల్లలు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నిమజ్జన ఘాట్ల వద్ద ఈత రాని వారు, చిన్నపిల్లలు, మహిళలు నీటికి దూరంగా ఉండేలా చూడాలని సూచించారు. విగ్రహాలను తరలించే సమయంలో విద్యుత్ తీగల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు.

### సెప్టెంబర్ 22న కర్నూలులో ట్రాఫిక్ మళ్లింపు.....

మంగళవారం ఉదయం 10 గంటల నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు కర్నూలు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు అమల్లో ఉంటాయని ఎస్పీ తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్--రాజ్‌విహార్ సెంటర్--ప్రభుత్వ ఆసుపత్రి--వినాయక్ ఘాట్--గాయత్రి ఎస్టేట్ మార్గంలో సాధారణ వాహనాల రాకపోకలను అనుమతించరు. అత్యవసర సేవలకు సంబంధించిన 108, ఫైర్, అంబులెన్స్, పోలీసు వాహనాలు, పోలీసుల అనుమతి పొందిన వాహనాలకు మాత్రమే అవసరమైన మేరకు మార్గంలో అనుమతి ఉంటుంది.

### ప్రత్యామ్నాయ మార్గాలు....

- ఆర్టీసీ బస్టాండ్ వైపు నుంచి వచ్చే వాహనాలు బళ్లారి చౌరస్తా--కల్లూరు చెన్నమ్మ సర్కిల్--గుత్తి పెట్రోల్ బంక్--బిర్లా జంక్షన్--మద్దూర్‌నగర్ సర్కిల్--సి.క్యాంప్ మీదుగా నంద్యాల చెక్‌పోస్టు వైపు వెళ్లాలి.
- ఆత్మకూరు, నంద్యాల, నందికోట్కూరు వైపు నుంచి వచ్చే వాహనాలు సి.క్యాంప్--బిర్లాగేట్--గుత్తి పెట్రోల్ బంక్--కల్లూరు చెన్నమ్మ సర్కిల్--బళ్లారి చౌరస్తా మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వైపు వెళ్లాలి.
- హైదరాబాద్, గద్వాల, అలంపూర్ వైపు నుంచి వచ్చే వాహనాలు తుంగభద్ర బ్రిడ్జి--సంతోష్‌నగర్--బళ్లారి చౌరస్తా మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకోవాలి.
- అనంతపురం, డోన్ వైపు నుంచి వచ్చే వాహనాలు గుత్తి పెట్రోల్ బంక్--బళ్లారి చౌరస్తా మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వైపు వెళ్లాలి.
- నిమజ్జనం అనంతరం నిమజ్జన వాహనాలు దేవనగర్--కృష్ణనగర్--కల్లూరు బ్రిడ్జి మీదుగా నగరం బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టారు.

### డీజే వాహనాలకు ప్రత్యేక మళ్లింపులు....

కె.సి. కెనాల్, హెచ్ఎన్ఎస్ కెనాల్ వైపు వెళ్లే డీజే వాహనాలను పలు ప్రాంతాల్లో నిలిపివేసి ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించనున్నట్లు పోలీసులు తెలిపారు. రాజ్‌విహార్ వైపు నుంచి వచ్చే డీజే వాహనాలను ఎన్టీఆర్ సర్కిల్/కలెక్టరేట్ సర్కిల్, నంద్యాల చెక్‌పోస్టు వైపు నుంచి వచ్చే వాహనాలను మద్దూర్‌నగర్ మసీదు, చెన్నమ్మ సర్కిల్ -- షరీన్‌నగర్ -- బళ్లారి చౌరస్తా వైపు నుంచి వచ్చే వాహనాలను బిర్లా గేట్ వద్ద మళ్లించనున్నారు. అలాగే సి.క్యాంప్ వైపు నుంచి నంద్యాల చెక్‌పోస్టు మీదుగా వెళ్లే డీజే వాహనాలను నంద్యాల చెక్‌పోస్టు వద్ద, బళ్లారి చౌరస్తా--సంతోష్‌నగర్ వైపు నుంచి వచ్చే వాహనాలను కేశవ్ గ్రాండ్ హోటల్ సమీపంలో, గుత్తి పెట్రోల్ బంక్ మీదుగా వచ్చే డీజే వాహనాలను అక్కడే నిలిపి వెనక్కి మళ్లించనున్నారు. నిమజ్జన మార్గాల్లో అధిక సంఖ్యలో ఆసుపత్రులు ఉన్నందున రోగులు, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని డీజే వాహనాలపై ఈ నియంత్రణలు, మళ్లింపులు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. గణేష్ ఉత్సవ నిర్వాహకులు, ప్రజలు, మతపెద్దలు, రాజకీయ పార్టీలు, యువత, మీడియా ప్రతినిధులు పోలీసుశాఖకు సహకరించి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ విజ్ఞప్తి చేశారు.

# కర్నూలు వినాయక ఘాట్‌పై లోకేష్ ప్రశంసలు

**వినాయక ఘాట్ రూపాంతరంపై ప్రశంస**

**మంత్రి టీజీ భరత్, కలెక్టర్, కమిషనర్ కృషికి అభినందనలు**

**అధికార యంత్రాంగాన్ని అభినందించిన లోకేష్**



**కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 20, (సీమకిరణం న్యూస్):** కర్నూలు నగరంలోని వినాయక ఘాట్ అభివృద్ధి, రూపాంతరంపై రాష్ట్ర సమాచార సాంకేతికత, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, మానవ వనరుల అభివృద్ధి (విద్య), రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రశంసలు కురిపించారు. నగరంలోని వినాయక ఘాట్ వద్ద గత నాలుగు నెలలుగా చేపట్టిన పారిశుద్ధ్య, అభివృద్ధి పనులకు సంబంధించిన వీడియోను కర్నూలు నగరపాలక సంస్థ ప్రత్యేకంగా రూపొందించి శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసింది. ఈ వీడియోను శనివారం మంత్రి నారా లోకేష్ ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వేదికల్లో రీ-అప్‌లోడ్ చేసి, మంత్రి టీజీ భరత్, కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి, కమిషనర్ చల్లా ఓబులేసుతో పాటు అధికార యంత్రాంగాన్ని అభినందించారు. చెత్తతో నిండిన ప్రాంతం నుంచి పరిశుభ్రమైన, అందమైన, అభివృద్ధి చెందిన వినాయక ఘాట్‌గా మారడం అభినందనీయమని మంత్రి నారా లోకేష్ కొనియాడారు. కేంద్రీకృత పాలన, ప్రాథమిక అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తే ఎలాంటి మార్పు సాధ్యమవుతుందో కర్నూలు వినాయక ఘాట్ రూపాంతరం చూపిస్తోందన్నారు. ఈ మార్పు కోసం కృషి చేసిన రాష్ట్ర మంత్రి టీజీ భరత్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుతో పాటు మొత్తం అధికార యంత్రాంగానికి అభినందనలు తెలిపారు. రాజకీయ నాయకత్వం స్థానిక పరిపాలనా యంత్రాంగంతో కలిసి పనిచేస్తే అద్భుతమైన మార్పులు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. పరిశుభ్రంగా మారిన ప్రజా ప్రదేశాలను ఇకపై కూడా పరిశుభ్రంగానే ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఈ అందమైన మార్పును కాపాడుకోవడంలో ప్రజలు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. కాగా, నాలుగు నెలల క్రితం కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన చల్లా ఓబులేసు తొలుత జేసీబీలతో పెద్ద ఎత్తున చెత్తాచెదారాన్ని తొలగింపజేశారు. అనంతరం ఘాట్ వద్ద సీసీ రహదారి, మెట్లు, బండ్, డ్రెయిన్, రాతి నిర్మాణాలు, ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారు. కేసీ కెనాల్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్క మొక్కలను తొలగింపజేయడంతో పాటు ఘాట్ పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక సిబ్బందిని కేటాయించారు. కెనాల్‌లో చెత్త వేయకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, చెత్త సేకరణ ట్రాలీలను అందుబాటులో ఉంచారు. దీంతో గతంలో చెత్తాచెదారంతో నిండిపోయిన ప్రాంతం ప్రస్తుతం పరిశుభ్రంగా, సుందరంగా రూపాంతరం చెందింది. ఈ మార్పులకు సంబంధించిన ప్రత్యేక వీడియోను కర్నూలు నగరపాలక సంస్థ రూపొందించి శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో విడుదల చేయగా, శనివారం మంత్రి నారా లోకేష్ ఆ వీడియోను తన సామాజిక మాధ్యమ ఖాతాల్లో రీ-అప్‌లోడ్ చేసి అభినందించడం విశేషం.

# గణనాథుల నిమజ్జనానికి సర్వం సిద్ధం

**నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**

**ఏర్పాట్లు పూర్తి చేసిన నగరపాలక యంత్రాంగం**

**మూడు ప్రాంతాల్లో నిమజ్జనానికి 15 క్రేన్లు**

**అధికార యంత్రాంగానికి భక్తులు సహకరించాలి**





**కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 20, (సీమకిరణం న్యూస్):** నగరంలో ఈ నెల 22న అత్యంత వైభవంగా జరగనున్న వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. ఆదివారం ఆయన కె.సి. కెనాల్ వినాయక ఘాట్, నన్నూరు టోల్‌గేట్ సమీపంలో, ఉల్లిందకొండ వద్ద హెచ్ఎన్ఎస్ఎస్ ఘాట్‌లలో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వినాయక విగ్రహాల నిమజ్జనానికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మూడు ప్రాంతాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. విగ్రహాలను సురక్షితంగా నిమజ్జనం చేసేందుకు కె.సి. కెనాల్ వినాయక ఘాట్ వద్ద 7, నన్నూరు టోల్‌గేట్ సమీపంలో 6, ఉల్లిందకొండ వద్ద 2 చొప్పున మొత్తం 15 క్రేన్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నిమజ్జన ప్రాంతాల్లో విద్యుత్, లైటింగ్, బారికేడింగ్, మైక్ అనౌన్స్‌మెంట్స్, డబ్ల్యూబీఎం రహదారుల నిర్మాణం, పారిశుద్ధ్య నిర్వహణతో పాటు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు, నగరపాలక సిబ్బందిని సైతం అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. కె.సి. కెనాల్ వినాయక ఘాట్ వద్ద నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టామని, ప్రస్తుతం అక్కడ 9 అడుగుల ఎత్తులో నీరు నిల్వ ఉన్నట్లు కమిషనర్ తెలిపారు. నన్నూరు టోల్‌గేట్ సమీపంలో, ఉల్లిందకొండ వద్ద హెచ్ఎన్ఎస్ఎస్ ఘాట్‌లో కూడా భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. నిమజ్జన సమయంలో భక్తులు అధికార యంత్రాంగానికి సహకరించాలని కమిషనర్ కోరారు. విగ్రహాలను నిమజ్జన ప్రాంతాలకు తీసుకువచ్చే సమయంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా అధికారుల సూచనలు పాటిస్తూ క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బారికేడ్లు, సూచనలను పాటించాలని, క్రేన్ల వద్దకు అనవసరంగా వెళ్లకుండా సిబ్బందికి సహకరించాలని కోరారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిమజ్జన ప్రాంతాల్లో పారిశుద్ధ్య సిబ్బంది, అధికారులను అందుబాటులో ఉంచి నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నట్లు కమిషనర్ తెలిపారు. గణనాథుల నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంఈలు మనోహర్ రెడ్డి, గిరిరాజ్, డిఈఈ నరేష్, సానిటరీ ఇంస్పెక్టర్ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత దేవేంద్రప్ప కు యస్ టి యు ఆధ్వర్యం లో సన్మానం



**డోన్ టౌన్, సెప్టెంబర్ 20,(సీమ కిరణం న్యూస్):** రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు దేవేంద్రప్ప ను యస్ టి యు ఆధ్వర్యం లో ఘనంగా సన్మానం చేశారు, స్థానిక సాయి ఫంక్షన్ హాల్ లో ఆదివారం ఉదయం యన్ యన్ కాలనీ జడ్పీ హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు టీ సురేశ్ బాబు అధ్యక్షత వహించగా, యస్ టి యు రాష్ట్ర మాజీ అధ్యక్షుడు షణ్మూర్తి, యస్ టి యు నాయకులు వెంకటరమణ, ఏక్బాల్ , మౌలాలి ముఖ్య అతిథిలుగా హాజరుఅయినారు, డోన్‌లో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ప్రజాకవి, తెలుగు సాహితీవేత్త, సౌమ్యులు డాక్టర్ చిట్యాల దేవేంద్రప్ప 2026 సంవత్సరానికి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన సందర్భంగా యస్ టి యు డోన్ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సభాధ్యక్షులు కవిరాజహంస డాక్టర్ టి.సురేష్ బాబు మాట్లాడుతూ, విద్యార్థులకు విద్యాబోధనతో పాటు తెలుగు భాష, సాహిత్యం పట్ల ఆసక్తిని పెంపొందిస్తూ, తన సాహితీ సేవల ద్వారా సమాజానికి విశేష సేవలు అందిస్తున్న డాక్టర్ చిట్యాల దేవేంద్రప్ప కి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించడం డోన్ మండలానికి, ఉపాధ్యాయ సమాజానికి గర్వకారణమని అన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో నిబద్ధత, విద్యార్థుల పట్ల ఆప్యాయత, తెలుగు భాషా సాహిత్యాల పట్ల అభిమానం, సామాజిక చైతన్యాన్ని పెంపొందించే రచనలు ఆయనకు ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చాయని యస్ టి యు నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఆజాంబేగ్ కొనియాడారు. ఈ సందర్భంగా ఎస్ టి యు డోన్ మండల శాఖ తరపున డాక్టర్ చిట్యాల దేవేంద్రప్ప ని ఘనంగా సన్మానించి, శాలువా మరియు పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. ఆయన మరెన్నో ఉన్నత పురస్కారాలు అందుకోవాలని, ఉపాధ్యాయ రంగంలోనూ, సాహిత్య రంగంలోనూ మరింత సేవలు అందించాలని వక్తలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఇక్బాల్, జి వి రమణ, పూర్వ నాయకులు సన్మూర్తి, నరసింహులు, మండల నాయకులు రామ మోహన్, విశ్వనాథ్ మరియు ఉపాధ్యాయులు, యస్ టి యు నాయకులు, సాహితీవేత్తలు, విద్యాభిమానులు, మిత్రులు మరియు శ్రేయోభిలాషులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పుల్లాసి లక్ష్మన్న మృతికి బుగ్గన సంతాపం



**ప్యాపిలి సెప్టెంబర్ 20:(సీమ కిరణం న్యూస్) :** ప్యాపిలి మండల పరిధిలోని చిన్న పూదేళ్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పుల్లాసి లక్ష్మన్న అకాల మరణం చెందడంతో మాజీ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం లక్ష్మన్న మృతి విషయం తెలుసుకున్న బుగ్గన చిన్న పూదేళ్ల గ్రామానికి చేరుకుని ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లక్ష్మన్న కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. లక్ష్మన్న మృతి గ్రామానికి, పార్టీకి తీరని లోటని అన్నారు. ఆయన కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని బుగ్గన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బోరెడ్డి పుల్లారెడ్డి, మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, నాగభూషణ్ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, రామచంద్రుడు, భువనేశ్వర్ రెడ్డి, బోరెడ్డి రాము, ప్రభాకర్ రెడ్డి, చిన్న రామంజి, ఎర్రి స్వామి, చెన్నకేశవులు, కమతం వెంకటేశ్వరరెడ్డి, రమేష్, బొలికొండ, బంగి నాగరాజు, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రౌడీ షీటర్ల పై నిరంతరం నిఘా



**డోన్ టౌన్, సెప్టెంబర్ 20,(సీమ కిరణం న్యూస్):** రాబోయే ఎన్నికల నేపథ్యంలో డోన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు ఆదివారం పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. డోన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ జి. ఇంతియాజ్ భాష ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో నియోజకవర్గంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించకూడదని స్పష్టం చేశారు. గొడవలు, దౌర్జన్యాలు, బెదిరింపులు మరియు ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు రౌడీషీటర్లు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి, ప్రశాంత వాతావరణాన్ని పాడుచేయాలని చూస్తే వారిపై చట్టప్రకారం అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఇన్‌స్పెక్టర్ అన్నారు.

# 'గుండ్రేవుల'ను సాధించి తీరుతాం

**కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.శ్రీహర్ష**

**గుండ్రేవుల ప్రాజెక్టు సాధనకు సంతకాల సేకరణ**








**కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 20, (సీమకిరణం న్యూస్):** కర్నూలు జిల్లాకు జీవనాడి అయిన గుండ్రేవుల ప్రాజెక్టును సాధించి తీరుతామని కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.శ్రీహర్ష ఉద్ఘాటించారు. ఆదివారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని కేపీఎస్ కార్యాలయంలో గుండ్రేవుల ప్రాజెక్టు సాధనకై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీహర్ష మాట్లాడుతూ.. గుండ్రేవుల ప్రాజెక్టు సాధించే వరకు రాజీ లేకుండా తమ ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కర్నూలు నగరంలో వినాయక విగ్రహాల నిమజ్జనానికి సైతం నీరు లేని పరిస్థితి ఏర్పడిందని, జిల్లాలో నీటి నిల్వకు సరైన ప్రాజెక్టులు లేకపోవడం వల్లే ఇటువంటి పరిస్థితులు తలెత్తుతున్నాయని అన్నారు. జిల్లాలో వ్యవసాయానికి, తాగునీటికి, పారిశ్రామిక అవసరాలకు, నీటి వనరులను సమృద్ధిగా అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కర్నూలు జిల్లాలో నీటి కొరతను శాశ్వతంగా అధిగమించాలంటే గుండ్రేవుల ప్రాజెక్టును సాధించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గుండ్రేవుల ప్రాజెక్టు కోసం ప్రజలంతా భాగస్వాములు కావాలని శ్రీహర్ష పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరి సంతకం ఈ ఉద్యమానికి బలాన్ని చేకూరుస్తుందని, ప్రజల ఆకాంక్షను ప్రభుత్వానికి బలంగా తెలియజేసేందుకు పెద్ద ఎత్తున సంతకాలు సేకరించి ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. కర్నూలు జిల్లా భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించాలంటే గుండ్రేవుల ప్రాజెక్టు ఎంతో కీలకమని, ప్రాజెక్టు సాధన కోసం ప్రజలతో కలిసి నిరంతరం ఉద్యమిస్తామని శ్రీహర్ష స్పష్టం చేశారు.

# వినాయక ఉత్సవాల్లో సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయం : డాక్టర్. శంకర్ శర్మ





**కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 20, (సీమకిరణం న్యూస్):** వినాయక చవితి ఉత్సవాలు అందరూ కలిసి మెలిసి జరుపుకోవడం సంతోషంగా ఉందని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు శంకర్ శర్మ అన్నారు. కర్నూలు కలెక్టర్ కార్యాలయ ఆవరణలో విలేకరులు ఏర్పాటు చేసిన పాత్రికేయ గణేష్ మహోత్సవ సమితి విగ్రహం వద్ద ఉదయం ప్రత్యేక పూజలు చేసి అల్పాహారం అందించారు. ఈసందర్భంగా డాక్టర్. శంకర్ శర్మ మాట్లాడుతూ విలేకరులు ప్రతి సంవత్సరం మట్టి విగ్రహం ఏర్పాటు చేసి సమాజానికి ఆదర్శంగా నిలిచారన్నారు. వినాయక విగ్రహం ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి సంవత్సరం ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వినాయక విగ్రహం వద్దభక్తులకు అల్పాహారం, భోజనం అందించడం హర్షంచదగ్గ విషయం అన్నారు. విలేకరులు చేస్తున్న ఈకార్యక్రమంలో తనవంతు సహాయంగా నేడు అన్నదాన కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. విలేకరులు విధినిర్వహణలో ఎంతో కష్టపడుతునే సమాజానికి ఉపమోగపడే కార్యక్రమాలు చేస్తున్నారని డాక్టర్ శంకర్ శర్మ కొనియాడారు. కర్నూలు ప్రజలకు విలేకరులకు వినాయకుని ఆశీస్సులు ఉండాలని ఆయన కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో కులాలకు మతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి జీవించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. భారతదేశం వేద భూమి అని ఇక్కడ కులాలు, మతాల ప్రస్తావనలేదని హిందుత్వం అంటే జీవన విధానం అన్నారు. ఈ కార్యక్రమంలో విలేకరులు శ్రీనివాసులు, త్రినాథ్ రెడ్డి, మంజునాథ్, అనినాష్, రంగన్న, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు నగరపాలక సంస్థలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ



**కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 20, (సీమకిరణం న్యూస్):** కర్నూలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. నగరపాలక సంస్థకు చెందిన అన్ని విభాగాల అధికారులు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తారని పేర్కొన్నారు. కాలనీల్లో మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుధ్యం తదితర సమస్యలను ప్రజలు లిఖితపూర్వకంగా సమర్పించి పరిష్కారం పొందవచ్చని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమానికి హాజరు కాలేని పౌరులు 7422992299 నంబర్‌కు ఫోన్ చేయడం లేదా వాట్సాప్ ద్వారా తమ ఫిర్యాదులను తెలియజేయవచ్చని ఆయన తెలిపారు.

## రజక విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేసిన మంత్రి టీజీ భరత్







**కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 20, (సీమకిరణం న్యూస్) :** కర్నూలు నగరంలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన రజక విద్యార్థుల ప్రతిభ పురస్కారాల కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్, డిగ్రీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రజక విద్యార్థులకు మంత్రి టీజీ భరత్ ప్రతిభ పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఇతర రంగాల్లోనూ రాణించేలా తమ ప్రతిభను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థికి టైమ్ మేనేజ్‌మెంట్ ఎంతో ముఖ్యమని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కర్నూలు నియోజకవర్గానికి చెందిన విద్యార్థులకు టీజీవీ గ్రూప్ తరఫున ఒక్కొక్కరికి రూ.2,000 చొప్పున సహాయం అందిస్తామని మంత్రి టీజీ భరత్ తెలిపారు. అలాగే జిల్లా వారీగా ఉన్న విద్యార్థులకు కూడా సంబంధిత ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లతో మాట్లాడి అవసరమైన సహకారం అందించేలా కృషి చేస్తానని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలందరికీ తెలియాలని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం చేస్తున్న కృషితో పాటు, కర్నూలు అభివృద్ధికి తాను చేస్తున్న ప్రయత్నాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి తన వంతు సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని వారితో మంత్రి టీజీ భరత్ చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రామారావు, వ్యవస్థాపక అధ్యక్షులు సి.పి వెంకటేష్, నాయకులు లింగమయ్య, గణేష్, రేణుక, రాధ, తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు : మంత్రి టీజీ భరత్

రాంబొట్ల దేవాలయం వద్ద వినాయకుడికి మంత్రి టీజీ భరత్ ప్రత్యేక పూజలు



**కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 20, (సీమకిరణం న్యూస్):** నీటి కష్టాలు ఉన్నప్పటికీ వినాయక నిమజ్జనానికి ప్రణాళికాబద్ధంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. కర్నూలు నగరంలోని రాంబొట్ల దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడిని మంత్రి టీజీ భరత్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ కర్నూలు నగరంలో వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయని తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని దేవుడిని కోరుకుంటున్నట్లు చెప్పారు. కేసీ కెనాల్‌లో రెండు వైపులా గోడలు నిర్మించి, ట్యాంక్ తరహాలో నీటిని నిల్వ చేసి వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు చేసినట్లు మంత్రి తెలిపారు. దీంతో పాటు నన్నూరు టోల్ ప్లాజా వద్ద హంద్రీనీవాలో కూడా వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు చేశామని చెప్పారు. ప్రజలు తమకు ఇష్టమైన ప్రాంతాల్లో వినాయక నిమజ్జనం చేసుకోవచ్చని మంత్రి తెలిపారు. అనంతరం మంత్రి టీజీ భరత్ నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించి, అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

–అధ్యక్ష, కార్యదర్శులుగా ఎం.శివశంకర్, టీజీ ప్రసాదు

విజయవంతమైన ఏపీడబ్ల్యూజేఎఫ్ నాలుగో మహాసభలు





**కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 20, (సీమకిరణం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్(ఏపీడబ్ల్యూజేఎఫ్) నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆధ్యక్షుడిగా ఎం.శివశంకర్, ప్రధాన కార్యదర్శిగా టీజీ ప్రసాదు ఎంపికయ్యారు. శనివారం జెడ్పీ మీటింగ్ హాలులో ఏపీడబ్ల్యూజేఎఫ్ నాలుగో, ఏపీ బ్రాడ్కాస్టింగ్ జర్నలిస్టు అసోసియేషన్ మొదటి మహాసభలు జరిగాయి. ఈ మహాసభలకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, రాయలసీమ జిల్లాల ఇన్చార్జి జయరాజ్, ఎన్ఏజే నాయకులు ఆకుల అమరయ్య. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బి.గోరంట్లప్ప, చిన్న పత్రికల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.హుస్సేనాఖాన్, నగర కార్యదర్శి ఎం. ఎర్రమల, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి. ఐఅండ్ పీఆర్ డీడీ జయమ్మ హాజరవ్వగా..జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో విలేఖర్లు హాజరై విజయవంతం చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ముఖ్యఅతిథుల ప్రసంగాలు. 2 నుంచి 6 గంటల వరకు ప్రతినిధుల సభ, నూతన కార్యవర్గం ఎన్నికను చేపట్టారు. అందులో భాగంగా జిల్లా నూతన కమిటీని సంప్రదింపుల తరువాత ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం.శివశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా టీజీ ప్రసాదు. గౌరవాధ్యక్షుడిగా జి.శివన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంయూ వినయ్కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డి.చంద్రమోహన్, ప్రచార కార్యదర్శిగా ఏ గోపాల కృష్ణ, కోశాధిరిగా టి.సుజాత, ఉపాధ్యక్షులు గా ఎం.కృష్ణ, గౌస్ మొయిద్దీన్. వి. మాదప్ప, నాగలింగన్న, సహాయ కార్యదర్శులుగా మునెప్ప, మాణిక్యం, ఉరుకుంద, జయరాజు, కార్యవర్గ సభ్యులుగా రామాంజనేయులు, యూసూఫ్, రాజేష్, మునిస్వామి, ఎస్.పద్మ ఎంపికయ్యారు.


## ఆరోగ్యానికి అసలైన నియమాలు ఎప్పుడు ఎలా తింటే మంచిదో తెలుసా





పతంజలి వ్యవస్థాపకుడు రామ్‌దేవ్, బాల్కృష్ణ. ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండటం విషయానికి వస్తే, గుండె జబ్బులు, ఊబకాయం మొదలైన వాటికి భయపడి ప్రజలు నెయ్యి, నూనెతో చేసిన వాటిని తినడం మానేస్తారు. అయితే ఆయుర్వేదం మన ఆహారంలో తగినంత నెయ్యి, నూనె ఉండాలని చెబుతుంది. నూనె, నెయ్యి ఆహార రుచిని పెంచడమే కాకుండా, ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయని చెబుతున్నారు. మన శరీరం సరిగ్గా పని చేయాలంటే కొవ్వు కచ్చితంగా అవసరం అంటున్నారు. ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్లు ఏ,డీ,ఈ, కే లను శరీరం గ్రహించేలా చేస్తాయి. ఇవి హార్మోన్ల ఉత్పత్తికి చాలా అవసరం. ఇవన్నీ మన చర్మాన్ని, మెదడును ఆరోగ్యంగా ఉంచుతాయని చెబుతున్నారు. ఆచార్య బాలకృష్ణ చెప్పిన వివరాల ప్రకారం.. ఎప్పుడూ తాజాగా తయారుచేసిన, వేడి ఆహారాన్ని మాత్రమే తినాలని చెబుతున్నారు. ఇటువంటి ఆహారం రుచికరంగా ఉండటమే కాకుండా పోషకాలతో సమృద్ధిగా ఉంటుంది. అలాంటి ఆహారం సులభంగా జీర్ణం అవుతుందని అంటున్నారు. నిల్వ ఉంచిన ఆహారాన్ని వేడి చేసి అస్సలు తినకూడదని అంటున్నారు. ఆహారం రుచి మాత్రమే కాదు, దాని రంగు, వాసన, వడ్డించే విధానం కూడా జీర్ణ రసాలను ప్రేరేపిస్తుందని ఆయుర్వేదం చెబుతోంది. అలాగే, భోజనం చేసేప్పుడు మీ చుట్టూ ఉన్న పర్యావరణం కూడా అంతే అనుకూలంగా ఉండాలని చెబుతున్నారు. ఆహారాన్ని బాగా వడ్డించడం ఎంత ముఖ్యమో, మీరు కూర్చుని తినే వాతావరణం ఆహ్లాదకరంగా, ప్రశాంతంగా ఉండటం కూడా అంతే ముఖ్యం. అంటున్నారు. ఇందులో పరిశుభ్రత అత్యంత ముఖ్యమైనది అంటున్నారు. ఇతరులతో కలిసి భోజనం చేయడానికి ప్రయత్నించాలని ఆయుర్వేదం చెబుతుంది. ఆహారాన్ని ఎల్లప్పుడూ ఏకాగ్రతతో తినాలి. భోజనం చేసేటప్పుడు వేరే దేనిపైనా దృష్టి పెట్టకండి. సింధూర్ నుండి బాలాకోట్ వరకు..భారత్ సత్తాను నిరూపించిన ఆపరేషన్స్ ఇకపోతే, ఆహారం తినే విధానానికి సంబంధించిన నియమాల గురించి మాట్లాడుకుంటే, ఆయుర్వేదం ప్రకారం, కాళ్లకు చెప్పులు, బూట్లు ధరించి ఎప్పుడూ తినకూడదు. ఆహారాన్ని గౌరవించడం మాత్రమే కాదు, పాదరక్షలు ధరించడం వల్ల పాదాల నుండి వేడి ఉత్పత్తి అవుతుంది. దీంతో జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. కాబట్టి ఇది చాలా ముఖ్యం. చేతులు, కాళ్ళు కడుక్కుని, తుడుచుకున్న తర్వాతే ఆహారం తీసుకోవాలి. ముందుగా ప్రకృతికి ప్రార్థన చేసి కృతజ్ఞతలు తెలియజేయాలి. తినడానికి ముందు, 2-3 సిప్స్ నీరు త్రాగండి. ఇది గొంతు మార్గాన్ని క్లియర్ చేస్తుంది. మీరు ఆహారాన్ని మరింత సులభంగా తినగలుగుతారు. ఆహారాన్ని చేతులతో తినాలి. ఇది ఆహారం పట్ల ఆసక్తిని పెంచుతుంది. అప్పుడే మీరు వేడి, చలిని ఆస్వాదిస్తారు. నేలపై సౌకర్యవంతమైన స్థితిలో కూర్చుని మాత్రమే భోజనం చేయాలని చెబుతున్నారు. కానీ, నిలబడి, నడుస్తూ తినడం సరైనది కాదని అంటున్నారు. అలాగే, తినేటప్పుడు సంతోషంగా ఉండటం కూడా ముఖ్యం. ప్రతికూల భావోద్వేగాలు జీర్ణక్రియపై చెడు ప్రభావాన్ని చూపుతాయని అంటున్నారు.. ఇది జీర్ణ రసాల స్రావాన్ని అడ్డుకుంటుందని చెబుతున్నారు. దీంతో అజీర్ణం, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తలెత్తుతాయని అంటున్నారు. అంతేకాదు.. మీరు ఎలాంటి వ్యాధులు లేని ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలనుకుంటే సమయానికి ఆహారం తీసుకోవడం ఉత్తమమని ఆయుర్వేదం చెబుతోంది. ఆహారం సరిగ్గా జీర్ణం కావడానికి సరైన సమయంలో క్రమం తప్పకుండా తినండి. దీనితో పాటు, గుర్తుంచుకోవలసిన మరికొన్ని విషయాలు కూడా ఉన్నాయి. మొదటిసారి తిన్న ఆహారం పూర్తిగా జీర్ణమైనప్పుడు, అంటే మీకు సరిగ్గా ఆకలిగా అనిపించడం ప్రారంభించినప్పుడు, అప్పుడు మాత్రమే ఆహారం తినండి. లేకపోతే, కడుపులో ఇప్పటికే ఉన్న జీర్ణం కాని రసం తాజా ఆహారంతో కలిసిపోతుంది. ఇది శరీర దోషాలను మరింత దిగజార్చి, మీ శరీరాన్ని వ్యాధులకు గురి చేస్తుంది. అందుకే మధ్యాహ్న భోజనం 12 నుండి 2 గంటల మధ్య తీసుకోవాలి. ఇది శరీరానికి బలాన్ని ఇస్తుంది. ఆహారం కూడా సరిగ్గా జీర్ణమవుతుంది. దీని కారణంగా అన్ని పోషకాలు లభిస్తాయి. ఆహారం నుండి శరీరానికి సరైన పోషకాలు అందేలా చూసుకోవడానికి, మీరు సరైన పరిమాణంలో తినడం ముఖ్యం. దీని కోసం, తినేటప్పుడు మీ కడుపులో మూడింట ఒక వంతు లేదా నాలుగో వంతు ఖాళీగా ఉండేలా చూసుకోవాలి. ఇది ఆహారం జీర్ణం కావడానికి సహాయపడుతుంది. వాత కదలికను కూడా నియంత్రిస్తుందని పతంజలి వ్యవస్థాపకుడు ఆచార్య బాలకృష్ణ అంటున్నారు. వీటిని మీ రోజువారీ జీవితంలో అలవాటు చేసుకుంటే మిమ్మల్ని మీరు ఆరోగ్యంగా ఉంచుకోవచ్చునని చెబుతున్నారు.

పతాంజలిని స్థాపించిన యోగా గురువు బాబా రామ్‌దేవ్ బాబా. ఆచార్య బాలకృష్ణ ఆరోగ్యకరమైన జీవితం కోసం ప్రజలకు అవసరమైన ఆయుర్వేద సమాచారాన్ని కూడా అందిస్తున్నారు. ఇందులో భాగంగానే మీరు ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండటానికి సహాయపడే ఆహారానికి సంబంధించిన కొన్ని ప్రత్యేకమైన విషయాలను వివరించారు. ఆయుర్వేదం ప్రకారం సరైన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవచ్చో తెలియజేశారు. ఆ వివరాల్లోకి వెళితే... ఆహారం, ఆరోగ్యం ఒకదానికొకటి ప్రత్యక్షంగా దగ్గరి సంబంధం కలిగి ఉంటాయి. మీరు ఆరోగ్యంగా ఉండాలనుకుంటే ఆహారంలో పోషకాలు సమృద్ధిగా ఉండేలా చూసుకోవడం మాత్రమే కాదు..ఆహారానికి సంబంధించిన కొన్ని నియమాలను పాటించడం కూడా తప్పనిసరి అంటున్నారు.. పతాంజలిని స్థాపించిన యోగా గురువు బాబా రామ్‌దేవ్ బాబా. ఆచార్య బాలకృష్ణ ఆరోగ్యకరమైన జీవితం కోసం ప్రజలకు అవసరమైన ఆయుర్వేద సమాచారాన్ని కూడా అందిస్తున్నారు. ఇందులో భాగంగానే మీరు ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండటానికి సహాయపడే ఆహారానికి సంబంధించిన కొన్ని ప్రత్యేకమైన విషయాలను వివరించారు. ఆయుర్వేదం ప్రకారం సరైన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవచ్చో తెలియజేశారు. ఆ వివరాల్లోకి వెళితే ఆరోగ్యానికి ఆహారం ఎంత ముఖ్యమో అందరికీ తెలుసు. ఆయుర్వేదం ప్రకారం ఆహారం నాణ్యత సరిగ్గా ఉండటంతో పాటు, దాని పరిమాణం, మీరు తినే పరిస్థితులు కూడా మీ ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయంటున్నారు


## సింధూరం స్వచ్ఛమైనదో నకిలీదో గుర్తించేదెలా అసలు ఎలా తయారు చేస్తారంటే











కాదేదీ కల్తీకి అనర్హం అన్న సామెతను సార్థకం చేస్తూ దేశంలో అనేక వస్తువులు, నిత్యవసర వస్తువులు, తినే ఆహారం అన్నింటిలోనూ కల్తీకి తెగబడుతున్నారు కొందరు కేటుగాళ్లు. పాలు, పెరుగు, జున్ను, పండ్లు, కూరగాయలు, ఉప్పు, పప్పు, వంటనూనెలు ఇలా ఒక్కటేమిటీ.. ఈ కలికాలంలో ప్రతిదీ కల్తీమయమే. అరటి, మామిడి, బొప్పాయి వంటి పండ్లు, తియ్యటి చక్కెరలో కెమికల్స్, బెల్లం రంగు, రుచి రావడం కోసం కూడా రసాయనాలు వాడుతున్నారు. చివరకు ఆడవాళ్లు నుదుటన ధరించే సింధూరంలోనూ కల్తీ ఉంటుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మార్కెట్లో నకిలీ సిందూరం దొరుకుతుండటంతో మహిళలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. అసలు, నకిలీ సిందూరాలను ఎలా గుర్తించాలో తెలుసుకుందాం. హనుమంతుడి విగ్రహం ఎప్పుడు సింధూరముతో నిండి వుంటుంది. ముత్తాయిదువులు నుదిటన ధరించే సింధూరం ఎలా తయారు చేస్తారో తెలిస్తే ఆశ్చర్యపోవాల్సిందే. ఎందుకంటే సింధూరం ఒక చెట్టు కాయల నుంచి తయారు చేస్తారు. దీనిని లిపిస్టిక్ ట్రీ అని కూడా అంటారు. సింధూరం చెట్టు కాయలు స్ట్రాబెర్రీకి చాలా దగ్గరగా ఉంటాయి. హనుమంతుడి విగ్రహం ఎప్పుడు సింధూరముతో నిండి వుంటుంది. ముత్తాయిదువులు నుదిటన ధరించే సింధూరం ఎలా తయారు చేస్తారో తెలిస్తే ఆశ్చర్యపోవాల్సిందే. ఎందుకంటే సింధూరం ఒక చెట్టు కాయల నుంచి తయారు చేస్తారు. దీనిని లిపిస్టిక్ ట్రీ అని కూడా అంటారు. సింధూరం చెట్టు కాయలు స్ట్రాబెర్రీకి చాలా దగ్గరగా ఉంటాయి.

**1 / 5**

ఆయా ప్రాంతాలని బట్టి ఎరుపు, మెరూన్ రంగుల్లో ఈ కాయలు ఉంటాయి. కాయని వలిచి అందులో ఉండే పిక్కల నుండి సింధురాన్ని తీస్తారు. ఆ పిక్కలని ఎండబెట్టి పొడి చేస్తే సింధూరం పొడి తయారవుతుంది. పచ్చి పిక్కలని నలిపితే కూడా చేతికి సింధూరం రంగు అంటుకుంటుందని చెబుతున్నారు. ఇదీ అసలైన సిందూరం. సింధూరం కాయలోని గింజలన్నీ ఒక పాత్రలో చేర్చి కాస్త నీళ్ళు చిలకరించి కలిపితే సింధూరం తయారైనట్టే. ఆయా ప్రాంతాలని బట్టి ఎరుపు, మెరూన్ రంగుల్లో ఈ కాయలు ఉంటాయి. కాయని వలిచి అందులో ఉండే పిక్కల నుండి సింధురాన్ని తీస్తారు. ఆ పిక్కలని ఎండబెట్టి పొడి చేస్తే సింధూరం పొడి తయారవుతుంది. పచ్చి పిక్కలని నలిపితే కూడా చేతికి సింధూరం రంగు అంటుకుంటుందని చెబుతున్నారు. ఇదీ అసలైన సిందూరం. సింధూరం కాయలోని గింజలన్నీ ఒక పాత్రలో చేర్చి కాస్త నీళ్ళు చిలకరించి కలిపితే సింధూరం తయారైనట్టే.

**2 / 5**

ఇకపోతే, ఈ సింధూరం చెట్టు ఆకులు తమలపాకు కి దగ్గరగా ఉంటాయట. తెల్లటి పూలు పూస్తాయి. గుత్తులు గుత్తులుగా కాయలు కాస్తాయి. కాయలు విచ్చుకుంటాయి. ఎంత జాగ్రత్తగా విచ్చుకుంటుందంటే.. కాయలోని సగం డిప్ప మూత తెరిచినట్టుగా పైకి లేస్తుంది. కానీ, ఒక్క గింజ కూడా కిందపడదు. ఇకపోతే, ఈ సింధూరం చెట్టు ఆకులు తమలపాకు కి దగ్గరగా ఉంటాయట. తెల్లటి పూలు పూస్తాయి. గుత్తులు గుత్తులుగా కాయలు కాస్తాయి. కాయలు విచ్చుకుంటాయి. ఎంత జాగ్రత్తగా విచ్చుకుంటుందంటే.. కాయలోని సగం డిప్ప మూత తెరిచినట్టుగా పైకి లేస్తుంది. కానీ, ఒక్క గింజ కూడా కిందపడదు.


**3 / 5**

అసలు సిందూరం చెట్టు నుండి తయారవుతుంది. నకిలీ సిందూరం లెడ్, సింథటిక్ రంగులతో తయారవుతుంది. గుర్తించడానికి కాస్త సిందూరాన్ని తీసుకుని చేతిపై వేసుకుని బాగా రుద్ది ఊదండి.. అప్పుడు అది ఎగిరిపోతే అసలు, చేతికి అంటుకుంటే నకిలీ అని గుర్తుపెట్టుకోండి. సింథటిక్ రంగుల వల్ల నకిలీ సిందూరం చేతికి అంటుకుంటుంది. అసలు సిందూరం చెట్టు నుండి తయారవుతుంది. నకిలీ సిందూరం లెడ్, సింథటిక్ రంగులతో తయారవుతుంది. గుర్తించడానికి కాస్త సిందూరాన్ని తీసుకుని చేతిపై వేసుకుని బాగా రుద్ది ఊదండి.. అప్పుడు అది ఎగిరిపోతే అసలు, చేతికి అంటుకుంటే నకిలీ అని గుర్తుపెట్టుకోండి. సింథటిక్ రంగుల వల్ల నకిలీ సిందూరం చేతికి అంటుకుంటుంది.

**4 / 5**

సున్నం, సింథటిక్ రంగులు, గాజు ముక్కలతో నకిలీ సిందూరం తయారవుతుంది. అసలు సిందూరం మొక్కల నుండి సేకరించిన విత్తనాలతో తయారవుతుంది. నెత్తిన చిటికెడు సిందూరం కూడా అనారోగ్యాలకు దారితీయవచ్చు. సిందూర తయారీలో వాడే కెమికల్స్ జుట్టు రాలడానికి కారణం కావచ్చు. సున్నం, సింథటిక్ రంగులు, గాజు ముక్కలతో నకిలీ సిందూరం తయారవుతుంది. అసలు సిందూరం మొక్కల నుండి సేకరించిన విత్తనాలతో తయారవుతుంది. నెత్తిన చిటికెడు సిందూరం కూడా అనారోగ్యాలకు దారితీయవచ్చు. సిందూర తయారీలో వాడే కెమికల్స్ జుట్టు రాలడానికి కారణం కావచ్చు.

## ఉదయం నిద్రలేవగానే గ్లాసుడు గోరువెచ్చని నీళ్లు తాగితే మీ లైఫ్‌లో సరికొత్త చాప్టర్ మొదలైనట్లే



చిన్నతనం నుంచి తల్లిదండ్రులు, ఆరోగ్య నిపుణులు ఉదయం నిద్ర లేవగానే గోరువెచ్చని నీరు తాగాలని పదేపదే చెబుతుంటారు. నిజంగా.. దీన్ని సీరియస్‌గా తీసుకునే వారు ప్రతి రోజూ ఈ అలవాటును అనుసరిస్తుంటారు. కానీ చేయలేని వారు అంతే స్థాయిలో నష్టపోతారు కూడా. అయితే ఈ అలవాటు మన ఆరోగ్యానికి ఎంత మంచిదో మీకు తెలుసా..? ఉదయం నిద్ర లేవగానే గోరువెచ్చని నీరు తాగడం ఓ మంచి అలవాటు. అందుకే చిన్నతనం నుంచి తల్లిదండ్రులు, ఆరోగ్య నిపుణులు ఈ విషయాన్ని పదేపదే చెబుతుంటారు. దీన్ని సీరియస్‌గా తీసుకునే వారు ప్రతి రోజూ ఈ అలవాటును అనుసరిస్తుంటారు. కానీ చేయలేని వారు అంతే స్థాయిలో నష్టపోతారు కూడా. అయితే ఈ అలవాటు మన ఆరోగ్యానికి ఎంత మంచిదో మీకు తెలుసా..? అవును. ఉదయం గోరువెచ్చని నీరు త్రాగడం వల్ల మన ఆరోగ్యంలో అనేక మార్పులు వస్తాయట. ఆయుర్వేదం నుంచి సైన్స్ వరకు ఉదయం ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీరు త్రాగడం ప్రయోజనకరమని చెబుతుంది. కాబట్టి ఉదయం నిద్రలేచిన తర్వాత గోరువెచ్చని నీరు తాగడం వల్ల శరీరంపై ఎలాంటి ప్రభావాలు ఉంటాయో ఇక్కడ తెలుసుకుందాం..

**ఉదయం గోరువెచ్చని నీరు త్రాగడం వల్ల కలిగే ప్రయోజనాలు ఇవే..**

**జీర్ణవ్యవస్థ బాగుంటుంది**

ఉదయం పూట నిద్ర లేచిన వెంటనే గోరువెచ్చని నీరు తాగడం వల్ల జీర్ణవ్యవస్థకు చాలా మేలు జరుగుతుంది. ఇది కడుపులో గ్యాస్, అజీర్ణం, ఆమ్లత్వం వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగించడమే కాకుండా మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగించి కడుపు తేలికగా అనిపించేలా చేస్తుంది. ఇది పేగు కండరాలను కూడా సడలిస్తుంది.

**విషాన్ని తొలగిస్తుంది**

ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీరు తాగడం వల్ల శరీరం పూర్తిగా నిర్విషీకరణ చెందుతుంది. ఈ నీరు శరీరం నుంచి విషాన్ని బయటకు పంపి, శరీరాన్ని లోపలి నుంచి శుద్ధి చేసి, చర్మాన్ని ప్రకాశవంతంగా మారుస్తుంది. కొంతమంది నిమ్మకాయ, తేనె కలిపి తాగుతారు. ఇది నిర్విషీకరణ ప్రక్రియకు మరింత సహాయపడుతుంది.

**ఏపీ పీజీసెట్ 2025 దరఖాస్తు గడువు పెరిగిందోచ్..**

**ఎప్పటి వరకంటే?**

**జీవక్రియను పెంచుతుంది**

మీరు బరువు తగ్గాలనుకుంటే ఉదయం గోరువెచ్చని నీరు తాగడం మంచిది. ఇది శరీర జీవక్రియను పెంచుతుంది. కాబట్టి, కేలరీలు వేగంగా కరుగుతాయి. ఉదయం గోరువెచ్చని నీరు తాగడం వల్ల రోజంతా శక్తి లభిస్తుందని వైద్యులు అంటున్నారు. శరీరం చురుగ్గా ఉంటుంది కూడా.

**రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది**

ఉదయం గోరువెచ్చని నీరు తాగడం వల్ల రక్త ప్రసరణ కూడా మెరుగుపడుతుంది. అదనంగా ఇది గుండె ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. ఇది కండరాలపై ఒత్తిడిని కూడా తగ్గిస్తుంది.

**చర్మ కాంతి పెరుగుతుంది**

ఉదయం గోరువెచ్చని నీరు తాగడం వల్ల చర్మం కాంతివంతంగా మారుతుంది. శరీరాన్ని లోపలి నుంచి శుభ్రపరిచి మేలు చేస్తుంది. దాని ప్రభావాలు చర్మంపై కూడా కనిపిస్తాయి. అంతేకాకుండా గోరువెచ్చని నీరు చర్మాన్ని హైడ్రేట్ చేస్తుంది. మొటిమలు, ముడతలను తగ్గించి చర్మాన్ని ప్రకాశవంతంగా మారుస్తుంది. చర్మ సంబంధిత సమస్యలతో బాధపడేవారు రోజూ ఉదయాన్నే గోరువెచ్చని నీరు తాగడం ప్రయోజనకరంగా ఉంటుంది.

**గమనిక:**

ఈ కంటెంట్ సాధారణ సమాచారం కోసం మాత్రమే. మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ వైద్యుడిని సంప్రదించడం మర్చిపోవద్దు.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2O18/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com